సాక్షి రంగారెడ్డి

గురువారం । 16 । ఫిబ్రవరి । 2023



అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు

ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. 8లో▸

పుష్పక్ బస్సు రూట్‌లో మార్పు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లే పుష్పక్ బస్సులు ఇకపై మరో కొత్త రూట్‌లో కూడా వెళ్తాయని రీజినల్ మేనేజర్ సీహెచ్ వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్, రాణీగంజ్, సెక్రటేరియట్ మీదుగా నాంపల్లి, అఫ్జల్‌గంజ్, జూపార్క్ మార్గంలో వెళ్తాయని తెలిపారు. ఉదయం 3.15 నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు సర్వీసులు కొనసాగుతాయన్నారు.

20 నుంచి ఫ్యాషన్ ఎగ్జిబిషన్

బంజారాహిల్స్: ఈ నెల 20 నుంచి 22 వరకు బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో సూత్ర ఫ్యాషన్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సన్నాహక ప్రదర్శన బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని ఎస్‌వీఎం గ్రాండ్ హోటల్‌లో నిర్వహించారు. దేశ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన డిజైనర్లు రూపొందించిన దుస్తులు, ఆభరణాలను మోడల్స్ ధరించి ఆకట్టుకున్నారు.

న్యూస్‌రీల్

జీపీల అభివృద్ధిలో సొంత నిధులు కీలకం



శిక్షణ సదస్సులో ప్రసంగిస్తున్న కడ్తాల్ సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి

కడ్తాల్: పంచాయతీల అభివృద్ధిలో సొంత ఆదాయ వనరులు కీలకమని కడ్తాల్ సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. వీటిని సమకూర్చుకోవాల్సిన బాధ్యత జీపీలు, సర్పంచ్‌లు, సెక్రటరీలపైనే ఉందని తెలిపారు. 'గ్రామ పంచాయతీల సొంత ఆదాయ వనరుల సమీకరణ' అంశంపై రాజేంద్రనగర్ ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన శిక్షణ శిబిరానికి బుధవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. గ్రామాల్లో వంద శాతం పన్నుల వసూలుపై దృష్టిసారించాలని తెలిపారు. పంచాయతీల్లో ఆదాయ వనరుల సృష్టికి తీసుకోవాల్సిన చర్యలు, సాధ్యాసాధ్యాలపై సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భగవాన్‌రెడ్డి, శిక్షణ తరగతుల కో ఆర్డినేటర్ చిన్నాదురై తదితరులు పాల్గొన్నారు.

భారత్‌కు వస్తే భాగ్యనగరాన్ని చూడాల్సిందే

ఆసియన్ దేశాల మీడియా ప్రతినిధులు

సాక్షి, సిటీబ్యూరో: చరిత్ర, సంస్కృతికి నిలయమైన హైదరాబాద్ నగరంలో అంతర్జాతీయ స్థాయి ఆధునిక వసతులు, ఆతిథ్యం అద్భుతంగా ఉందని ఆసియన్ దేశాల మీడియా ప్రతినిధులు ప్రశంసించారు. ఆసియాన్ -ఇండియా మీడియా ఎక్స్ఛేంజ్‌లో భాగంగా మయన్మార్, కాంబోడియా, వియత్నాం, థాయిలాండ్, ఇండోనేషియా, బ్రూనై, ఫిలిప్పీన్స్, మలేసియా దేశాలకు చెందిన 17 మంది పాత్రికేయుల బృందం ఈ నెల 12 నుంచి నగరంలోని పలు పారిశ్రామిక, చారిత్రక, వాణిజ్య ఆర్థిక సంస్థలను సందర్శించింది. ఈ సందర్భంగా బృంద సభ్యులు మాట్లాడుతూ.. భారత్‌ను పర్యటించాలనుకునే యువత కచ్చితంగా హైదరాబాద్ నగరాన్ని సందర్శించాల్సిన అవసరముందని వివరించారు. బుధవారం ఆసియన్ మీడియా ప్రతినిధులు శంషాబాద్ విమానాశ్రయం నుంచి సింగపూర్ ద్వారా ఆయా దేశాలకు తిరిగి వెళ్లారు. పర్యటనకు వచ్చిన ఆసియన్ మీడియా ప్రతినిధులను రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు బి. రాజమౌళి సత్కరించారు.

సింగరేణి స్టాల్‌కు ద్వితీయ బహుమతి

నాంపల్లి: అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనలో సింగరేణి సేవా సమితి ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి ఉత్పత్తుల స్టాల్‌కు ద్వితీయ బహుమతి లభించింది. నుమాయిష్‌లో మొత్తం 2,500 స్టాళ్లను ఏర్పాటు చేయగా కార్పొరేట్ విభాగంలో సింగరేణి సేవా సమితి స్టాల్‌కు ద్వితీయ బహుమతి లభించడం విశేషం. బుధవారం ఎగ్జిబిషన్ ముగింపు సందర్భంగా అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన స్టాళ్లకు ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ అవార్డులను ప్రకటించింది. స్టాల్ డెకరేషన్, వస్తు విక్రయ తీరు, ప్రచారం తదితర విషయాలను పరిగణనలోకి తీసుకుని సింగరేణి సేవా సమితి స్టాల్‌కు అవార్డుకు ఎంపిక చేసినట్లు ఎగ్జిబిషన్ నిర్వాహకులు తెలిపారు. ఎగ్జిబిషన్ సొసైటీ అధికారులు ప్రదానం చేసిన ఈ బహుతిని అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఎస్.భాస్కర్, సీనియర్ పీఓ ఎస్.శ్రీకాంత్, జీఎం (కోఆర్డినేషన్), సింగరేణి సేవా సమితి ఉపాధ్యక్షుడు ఎం.సురేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీఎం ఎం.సురేష్, డిప్యూటీ సూపరింటెండెంట్ కిశోర్ పాల్గొన్నారు.

పొలిటికల్ హీట్

ఇటు ఎమ్మెల్సీ ఎన్నికలు.. అటు అవిశ్వాస సెగలు

- ప్రజా క్షేత్రంలో.. పార్టీలు, నేతలు
- 'ముందస్తు' ప్రచారం నేపథ్యంలో అలర్ట్
- అభివృద్ధే ఎజెండాగా బీఆర్‌ఎస్ పర్యటనలు
- 'హాత్ సే హాత్' కార్యక్రమంతో కాంగ్రెస్ సందడి
- 'కార్నర్ మీటింగ్'లతో ఎలక్షన్‌కు సిద్ధమవుతున్న బీజేపీ శ్రేణులు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో జిల్లాలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ప్రభుత్వం ఏ క్షణమైనా అసెంబ్లీ రద్దు చేసి ముందస్తుకు వెళ్లొచ్చనే ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత జనంలోకి వెళ్లి ఓట్లు అడగడం కన్నా.. ఏడాది ముందు నుంచే వారి మధ్య ఉండటం ద్వారా ఎక్కువ లబ్ధి పొందవచ్చని అధికార, ప్రతిపక్ష పార్టీలు భావిస్తున్నాయి. దీంతో ఇప్పటి నుంచి ప్రజలకు చేరువయ్యే ప్రయత్నాలు ప్రారంభించాయి. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోకుండాపోయిన ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలే ఎజెండాగా ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ ప్రచారం చేస్తుండగా.. ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరిస్తూ బీఆర్‌ఎస్ ముందుకు సాగుతోంది.

అవిశ్వాసం, ఎమ్మెల్సీ ఎన్నికల వేడి

ఇప్పటికే పెద్ద అంబర్‌పేట్, ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల మున్సిపాలిటీల్లో అవిశ్వాసం అలజడి మొదలైంది. మరికొన్ని చోట్ల కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అయితే సభ్యులు ఇచ్చిన అవిశ్వాస లేఖలను కలెక్టర్ ఇప్పటి వరకు ఆమోదించలేదు. దీంతో పీఠాలను కాపాడుకునేందుకు చైర్మన్లు, చైర్‌పర్సన్లు ప్రయత్నిస్తున్నారు. తమను వ్యతిరేకిస్తున్న సభ్యులతో చర్చలు జరపడంతో పాటు ఆర్థిక పరమైన ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. ఎలాగైనా వీరిని కుర్చీ దించాలనే పట్టుదలతో ఉన్నవారిని క్యాంపులకు తీసుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా మున్సిపాలిటీల్లో రాజకీయం వేడెక్కింది. ఇదిలా ఉండగా.. మార్చి 13న ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎలక్షన్ కమిషన్ ఇప్పటికే షెడ్యూల్ జారీ చేసింది. రాజకీయాలకు అతీతంగా నిర్వహించే ఈ ఎన్నికలు జిల్లా అధికార, ప్రతిపక్ష పార్టీ నేతలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. ప్రత్యక్షంగా ప్రచారంలో పాల్గొనకపోయినా.. వెనుక ఉండి బరిలో ఉన్న అభ్యర్థులకు పలు రకాల సహాయ సహకారాలు అందిస్తున్నారు.

ప్రగతి నివేదనలు.. ప్రారంభోత్సవాలు

అధికార బీఆర్‌ఎస్ ఈ తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధి.. ప్రజా సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తోంది. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.. ఇప్పటికే పూర్తి చేసిన పనుల ప్రారంభోత్సవాలతో ఆ పార్టీ నేతలు బిజీగా గడుపుతున్నారు. మంత్రి సబితారెడ్డి కొద్ది రోజులుగా తను ప్రాతినిధ్యం వహిస్తున్న మహేశ్వరం వదలి బయటికి వెళ్లడం లేదు. నిత్యం ఏదో ఒక అంశంపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి, అభివృద్ధి పనుల్లో వేగం పెంచుతున్నారు. మార్నింగ్ వాక్.. నిరుద్యోగులకు జాబ్‌మేళా వంటి వినూత్న కార్యక్రమాలతో ఎల్బీనగర్ ఎమ్మెల్యే ప్రజల మధ్య ఉండేందుకు ప్రయత్నిస్తుండగా, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి 'ఉషోదయం' పేరుతో మున్సిపాలిటీల్లో పర్యటిస్తున్నారు. ఆయన తనయుడు 'ప్రగతి నివేదన' పేరుతో నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్నారు. కల్వకుర్తి, షాద్‌నగర్, చేవెళ్ల, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యులు నిత్యం ప్రజల మధ్యే ఉంటున్నారు. పెళ్లిళ్లు, చావులు.. ఇలా ఏ కార్యక్రమాన్ని మిస్ కావడం లేదు.

చేయిచేయి కలుపుతూ..

గతంలో వరుసగా పదేళ్ల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ జిల్లాలో ఎలాగైనా పట్టు నిలబెట్టుకోవాలని భావిస్తోంది. పార్టీ అధినేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో స్ఫూర్తిగా స్థానిక నేతలు హాత్ సే హాత్ కార్యక్రమం పేరుతో ప్రజల మధ్యకు వెళ్తున్నారు. ఇప్పటికే ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఇంటి పన్నుల పెంపునకు నిరసనగా మీర్‌పేట్, బడంగ్‌పేట్, జల్‌పల్లి మున్సిపాలిటీల్లో ప్రతి రోజు సాయంత్రం ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నారు. ఇబ్రహీంపట్నంలో మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా ఇదే పనిలో ఉన్నారు. కల్వకుర్తి, రాజేంద్రనగర్, చేవెళ్ల, శేరిలింగంపల్లి, ఎల్బీనగర్‌లో పార్టీకి బలమైన కేడర్ ఉన్నా.. నడిపించే నాయకుడు లేకపోవడం హస్తం పార్టీకి శాపంగా మారింది.

'ప్రజా గోస- బీజేపీ భరోసా'

రాష్ట్రంలో ఎలాగైనా అధికారంలోకి రావాలని భావిస్తున్న బీజేపీ ఇప్పటికే బూత్ లెవల్, విద్యార్థి సంఘాలు, యువజన, దళితమోర్చా, ఇతర అనుబంధ సంఘాల కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహించారు. షాద్‌నగర్, మహేశ్వరం, కల్వకుర్తిలో ఇవి ఇప్పటికే పూర్తయ్యాయి. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికార పార్టీ వైఫల్యాలు, పలువురు నేతల అవినీతిని ఎండగట్టే ప్రయత్నం చేస్తున్నారు. తాజాగా 'ప్రజాగోస- బీజేపీ భరోసా' పేరుతో కార్నర్ మీటింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రజా సమస్యలు.. ప్రభుత్వ వైఫల్యాలే ప్రధాన ఎజెండాగా ముందుకు వెళ్తున్నారు. ధరణి సమస్యలు.. డబుల్ బెడ్ రూం ఇళ్లు, పెన్షన్లు, కరెంట్ కోతలు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. కల్వకుర్తి, మహేశ్వరం, ఎల్బీనగర్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, షాద్‌నగర్‌లో ఈ కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయి. చేవెళ్ల, ఇబ్రహీంపట్నంలో నాయకత్వ లోపం కారణంగా ఈ విషయంలో కొంత వెనుకబడిందని చెప్పవచ్చు.

చట్టాన్ని గౌరవించాలి

- శాంతిభద్రతలను కాపాడాలి
- మహేశ్వరం డీసీపీ చింతమనేని శ్రీనివాస్



మాట్లాడుతున్న డీసీపీ శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రతిఒక్కరూ చట్టానికి లోబడి నడుచుకోవాలని మహేశ్వరం డీసీపీ చింతమనేని శ్రీనివాస్ అన్నారు. మహేశ్వరం తొలి డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన బుధవారం ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించారు. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం ఏసీపీ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. గతంతో పోలిస్తే ఇక్కడి జనాభా బాగా పెరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో కొత్త పోలీస్ జోన్ ఏర్పాటు చేశారని తెలిపారు. రోజురోజుకూ నేరాలు పెరుగుతున్నాయని, వీటిని అదుపులో పెట్టడమే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టంచేశారు.

క్రిమినల్ యాక్టివిటీస్‌ను సహించం

ఇబ్రహీంపట్నం, మహేశ్వరం ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలొచ్చాయని, దీంతో ప్రజల్లో ఆశలు పెరిగిపోయాయని తెలిపారు. ఈ నేపథ్యంలో చిన్న చిన్న లిటిగేషన్లు పెట్టుకుని పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. సివిల్ తగాదాల్లో పోలీసుల జోక్యం అవసరం లేదని, కానీ క్రిమినల్ యాక్టివిటీస్ చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ ప్రాంతంలో భూ తగాదాల పేరుతో పలు హత్యలు జరిగినట్లు రికార్డులు చెబుతున్నాయన్నారు. యువత పబ్బులు, క్లబ్బులు, హుక్కా, గంజాయి వంటి వ్యసనాల బారిన పడకూడదని తెలిపారు. మహిళలు, యువతులపై అనుచితంగా ప్రవర్తించినా, దౌర్జన్యాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ వంటి పేపర్లు వెంటపెట్టుకోవాలని తెలిపారు.

అక్కడొక్కటి.. ఇక్కడొక్కటి

- రూ.53 కోట్లతో పారిస్ తరహా బ్రిడ్జీలు
- మూసీ, ఈసాలపై ఒక్కొక్కటి చొప్పున
- పనులకు శ్రీకారం చుట్టిన యంత్రాంగం
- ఏడాదిలో పూర్తి చేసేందుకు చర్యలు



సాక్షి, సిటీబ్యూరో: చారిత్రక మూసీపై పారిస్ తరహాలో నిర్మించనున్న హైలెవెల్ బ్రిడ్జీల పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. తొలుత మూసీపై ఒకటి, ఈసాపై మరొకటి నిర్మించేందుకు సిద్ధమయ్యారు. రెండేళ్ల క్రితమే మూసీ, ఈసాలపై బ్రిడ్జీలు నిర్మించాలనుకున్నప్పటికీ ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు. నిర్మించే బ్రిడ్జీలు నగర చరిత్ర, ప్రాశస్త్యాన్ని చాటేలా ఉండటంతో పాటు, రవాణా సదుపాయాలు మెరుగుపడాలని, బ్రిడ్జీల ప్రాంతాల్లో అభివృద్ధి పెరగాలని, టూరిస్టు ప్రాంతాలుగానూ వెలగాలని మున్సిపల్ మంత్రి కేటీఆర్ భావించారు. ఈ నేపథ్యంలో పారిస్‌లోని వంతెనలను అధ్యయనం చేసేందుకు వివిధ ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులను పంపించారు. అధ్యయనం చేసి వచ్చిన అధికారులు పనులకు సిద్ధమయ్యారు. బ్రిడ్జిపై భాగంలో ఉండే డిజైన్, ఎలివేషన్ పనులు తర్వాతైనా చేయవచ్చని, ఈలోగా మిగతా పనులు చేపట్టాలని భావించి మూసీపై ఒక బ్రిడ్జికి, ఈసాపై మరో బ్రిడ్జికి టెండర్లు పిలిచారు.

హైలెవెల్ వంతెనలు ఇలా..

మూసీపై కారిడార్ నంబర్ 99 :
అంచనా వ్యయం రూ.40.02 కోట్లు.
ఈసాపై సన్‌సిటీ–చింతల్‌మెట్ (పవర్‌కారిడార్):
అంచనా వ్యయం రూ.12.88కోట్లు.
రెండింటికీ మొత్తం అంచనా వ్యయం :
దాదాపు రూ. 53 కోట్లు.
పనులు ఏడాదిలో పూర్తిచేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

రెండేళ్ల క్రితం ముంపు సమస్యలతో..

- నగరంలో 2020లో కురిసిన భారీ వర్షాలతో ముంపు సమస్యలు పునరావృతం కాకుండా ఉండేందుకు బ్రిడ్జీలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత అయిదు ప్రాంతాల్లో నిర్మించాలనుకున్నప్పటికీ.. అనంతరం వాటిని 15కు పెంచారు.

సేవాలాల్ మార్గం ఆదర్శనీయం



ఉప్పుగడ్డతండాలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

- మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: నియోజకవర్గ కేంద్రంలోని రెండెకరాల స్థలంలో సంత్ సేవాలాల్, దుర్గమ్మ ఆలయం, బంజారా భవన్ నిర్మిస్తున్నామని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఉప్పుగడ్డతండా డబుల్ బెడ్‌రూమ్స్ సమీపంలో బుధవారం నిర్వహించిన సేవాలాల్ జయంతి వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సేవాలాల్ మార్గం అందరికీ ఆదర్శనీయమన్నారు. గిరిజన, బంజారాల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నగరం నడిబొడ్డున ప్రభుత్వం నిర్మిస్తున్న బంజారా భవన్ పూర్తి కావచ్చిందని తెలిపారు. గిరిజనులు విద్య, రాజకీయ, సామాజిక రంగాల్లో ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, కార్తీక్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్, ఎంపీపీ రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునీత, ఉప్పుగడ్డ సర్పంచ్ కెతావత్ రెడ్యానాయక్, ఉప సర్పంచ్ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వసూలు 60 శాతమే

- ముంచుకొస్తున్న ఆర్థిక సంవత్సరం చివరి గడువు
- నత్తనడకన ఆస్తి పన్నుల వసూలు
- లక్ష్యం రూ.210 కోట్లు.. వసూలైంది రూ.118.73 కోట్లు
- మణికొండ టాప్... జల్‌పల్లి వెనుకంజ
- వచ్చిన ట్యాక్స్‌లు సిబ్బంది వేతనాలకే సరిపోతున్న వైనం



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఆస్తి పన్నుల చెల్లింపు చివరి గడువు (మార్చి 31) ముంచుకొస్తున్నా.. మెజార్టీ మున్సిపాలిటీల్లో వసూళ్లు 60 శాతం దాటలేదు. జిల్లాలో 14 మున్సిపాలిటీలు, రెండు మున్సిపల్ కార్పొరేషన్లు ఉండగా, వీటి పరిధిలో 2022- 23 ఆర్థిక సంవత్సరానికి సుమారు రూ.210 కోట్ల ఆస్తి పన్ను వసూలును లక్ష్యంగా నిర్ధారించుకున్నారు. కానీ వీటిలో ఇప్పటి వరకు రూ.118.73 కోట్లు మాత్రమే వసూలైంది. ట్యాక్స్ రూపంలో వచ్చిన ఈ మొత్తం సిబ్బంది జీతభత్యాలకు కూడా సరిపోవడం లేదు. దీంతో ఆయా మున్సిపాలిటీలు రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వంపై ఆధారపడాల్సి వస్తోంది. ఆస్తిపన్ను మదింపు చేసి, ఎప్పటికప్పుడు వసూలు చేస్తే.. లక్ష్యం చేరుకునే అవకాశమున్నా.. ఆయా మున్సిపాలిటీల్లోని అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. దీంతో ఏటా పన్నుల రూపంలో సమకూరుతున్న ఆదాయంకన్నా.. అప్పులే ఎక్కువ మూట కట్టుకోవాల్సి రావడం ఆందోళన కలిగిస్తోంది. మొండి బకాయిలు భారీగా పేరుకుపోతుండటం, కొత్తగా పన్నులు వచ్చి చేరుతుండటంతో ఇటు స్థానిక సంస్థలే కాకుండా అటు భవన యజమాలనుకు ఆర్థిక భారం తప్పడం లేదు.

ఇక్కడ సగం.. సగమే

షాద్‌నగర్ నియోజకవర్గం పరిధిలో షాద్‌నగర్ మున్సిపాలిటీ సహా కొత్తూరు మున్సిపాలిటీ కూడా ఉంది. వీటిలో కొత్తూరు పురపాలికలో 2,666 నిర్మాణాలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం ఇక్కడ 13,964 మంది ఉన్నారు. 8,326 మంది ఓటర్లు ఉన్నారు. ఆస్తిపన్ను రూపంలో మున్సిపాలిటీకి అతి తక్కువ ఆదాయం సమకూరుతోంది. వచ్చిన ఇన్‌కమ్ సిబ్బంది వేతనాలకు కూడా సరిపోవడం లేదు. అభివృద్ధి పథకాలపై ప్రభుత్వంపైనే ఆధారపడాల్సి వస్తోంది. ప్రభుత్వం ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో మున్సిపాలిటీలో అభివృద్ధిలో కుంటుపడుతోంది.

ఖర్చు అధికం

మహేశ్వరం నియోజకవర్గం పరిధిలో మీర్‌పేట్, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీలతో పాటు బడంగ్‌పేట్ కార్పొరేషన్ ఉంది. అత్యధిక నిర్మాణాలు ఈ ప్రాంతంలోనే ఎక్కువగా జరుగుతున్నాయి. లక్ష్యానికి తగ్గట్టుగా పన్నులు వసూలు చేయడం లేదు. మున్సిపల్ అధికారులు స్థానిక భవన యజమానులతో కుమ్మక్కై. అసెస్‌మెంట్లు కూడా చాలా తక్కువగా వేస్తున్నారనే ఆరోపణలున్నాయి. పేరుకు మున్సిపాలిటీ అయినా ఇప్పటికీ గ్రామీణ వాతావరణం వాసనలు పోలేదు. పన్నుల రూపంలో వచ్చిన మొత్తం సిబ్బంది జీతభత్యాలకు కూడా సరిపోవడం లేదు. అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, చెరువుల సుందరీకరణ వంటి చిన్నచిన్న పనులకు కూడా ప్రభుత్వ నిధులతోనే చేయాల్సివస్తోంది. ఇతర మున్సిపాలిటీలతో పోలిస్తే.. జల్‌పల్లిలో చాలా తక్కువ ఆస్తి పన్ను వసూలవుతోంది. ఇక్కడ ఓ వర్గం ప్రజలు పన్నులు చెల్లించకపోవడమే దీనికి కారణమని అధికారులు చెబుతుండటం గమనార్హం.

ఆదిబట్లలోనూ అంతంతే

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పెద్ద అంబర్‌పేట్, తుర్కయాంజాల్, ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల మున్సిపాలిటీలు ఉన్నాయి. శరవేగంగా విస్తరిస్తున్నాయి. గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు, బహుళ అంతస్తుల నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఆస్తిపన్నుల అసెస్‌మెంట్ చేయడంలో ఆయా అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారు. పన్ను వసూళ్ల లక్ష్యం ఘనంగా నిర్దేశించుకున్నప్పటికీ వసూళ్లలో మాత్రం ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. ఫలితంగా ఆయా మున్సిపాలిటీలు ప్రజల అవసరాలు తీర్చలేకపోతున్నాయి.

2022- 23లో లక్ష్యం.. వసూలైనది (రూ.కోట్లలో)

మున్సిపాలిటీ	టార్గెట్	వసూలైంది
ఇబ్రహీంపట్నం	9.32	4.32
తుర్కయంజాల్	10.39	6.41
ఆదిబట్ల	2.51	1.70
పెద్దఅంబర్‌పేట్	14.40	6.82
మణికొండ	45.28	27.28
నార్సింగి	27.04	15.91
బండ్లగూడ	21.61	12.15
శంషాబాద్	14.87	11.02
కొత్తూరు	1.70	0.72
మీర్‌పేట్	14.40	6.75
బడంగ్‌పేట్	20.00	12.00
తుక్కుగూడ	4.98	3.27
జల్‌పల్లి	9.50	4.50
షాద్‌నగర్	6.50	3.50
ఆమనగల్లు	1.47	0.58
శంకర్‌పల్లి	4.70	1.80

శంషాబాద్‌లో డబుల్ ట్యాక్స్‌లు

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని శంషాబాద్, నార్సింగి, మణికొండ మున్సిపాలిటీలు, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఉంది. ఇతర మున్సిపాలిటీలతో పోలిస్తే అత్యధిక ఆస్తిపన్ను వసూలవుతున్న జాబితాలో మణికొండ టాప్‌లో ఉంది. భూముల వేలం, బహుళ అంతస్తుల భవనాలు అసెస్‌మెంట్స్, ట్రేడ్ లైసెన్సులు, సైన్ బోర్డులు, ఐటీ అనుబంధ కంపెనీలు అధికంగా ఉండటమే అధిక ఆదాయానికి కారణం. మున్సిపాలిటీ సొంత వనరులపైనే ఆధారపడి ఉంది. ప్రభుత్వం నుంచి పెద్దగా నిధులు రాకపోయినప్పటికీ.. ప్రాపర్టీ ట్యాక్స్ రూపంలో వచ్చిన సొంత వనరులతో దూసుకుపోతోంది. అదేవిధంగా నార్సింగి, బండ్లగూడలో కొత్త అపార్ట్‌మెంట్లు, ఇతర వాణిజ్య సంస్థలకు సంబంధించిన ఆస్తులు, వాణిజ్య సముదాయాలపై ఎప్పటికప్పుడు మదింపు చేసి బిల్లులు జారీ చేసి సకాలంలో వసూలు చేస్తే.. వాటికి మరింత ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా శంషాబాద్ మున్సిపాలిటీలో రెట్టింపు పన్నులు వడ్డిస్తున్నారు. ఇది పూర్తిగా 111 జీవో పరిధిలో ఉండటం, నిర్మాణాలకు అనుమతులు లేకపోవడమే ఇందుకు కారణం.





కీసరగుట్ట లడ్డూ రెడీ

కీసరగుట్ట రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగనున్నాయి. భక్తులకు వసతులను కల్పించేందుకు దేవస్థానం పాలక మండలి, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేస్తున్నారు. కీసరగుట్టలో ఆలయ సిబ్బంది బుధవారం లడ్డూలను తయారు చేస్తున్నారు.

సేవాలాల్ ఆశయ సాధనకు కృషి




సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొందుర్గు: సంత్ సేవాలాల్ ఆశయ సాధన కోసం అందరం కలిసి కృషి చేద్దామని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని అయోధ్యాపూర్ తండాలో సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. తండా నుంచి కొందుర్గు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సేవాలాల్ సూచనలు సమాజానికి ఆదర్శనీయమన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చౌదరిగూడలో గిరిజన నాయకుల ఆధ్వర్యంలో సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, నాయకులు సయ్యద్ సాధిక్, అశోక్ రెడ్డి, గోపాల్, బందులాల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

కీసర: కీసరగుట్ట శ్రీ భవానీరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతున్నాయని, ఈ సందర్భంగా భక్తులకు అన్నిసౌకర్యాలు కల్పించినట్లు జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా అదనపు కలెక్టర్లు, నర్సింహ్మారెడ్డి, అభిషేక్ అగస్త్యన్, జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సత్యనారాయణ, డీసీపీ జానకి, ఆలయ కమిటీ చైర్మన్ రమేష్ శర్మలతో కలిసి ఆయన కీసరలో పర్యటించారు. జాతర జరిగే ప్రాంతమంతా కలియతిరుగూ వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పరిశీలించారు. క్యూలైన్లు, పార్కింగ్ ప్రాంతం, ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపట్టిన పనులు పరిశీలించిన అనంతరం స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా



మూలవిరాట్టు

కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 16 నుండి 21 వరకు జరుగనున్న స్వామి వారి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. నగర నలుమూలలతో పాటు, వివిధ జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఇందుకోసం తగిన ఏర్పాట్లు చేయాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఈ నెల 18న మహాశివ రాత్రి రోజున భక్తులు అధికంగా వస్తారని, అందుకు తగినట్లుగా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు.

అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- రాయపోల్‌లో ప్రగతి నివేదన పాదయాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి నిర్వహిస్తున్న ప్రగతి నివేదన పాదయాత్రలో భాగంగా మంగళవారం రాత్రి రాయపోల్ గ్రామంలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. తాను మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పుడు ప్రతిపక్షంలో ఉన్నానని, అప్పుడు అంతగా అభివృద్ధి చేయలేకపోయినట్లు చెప్పారు. తదుపరి ఎమ్మెల్యేగా గెలిచిన రెండు సార్లు కేసీఆర్ నాయకత్వంలో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. గతంలో మంచినీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారిని, ఇప్పుడు ఆ సమస్య లేదన్నారు. రాయపోల్‌లో బీటీ, సీసీ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మిషన్ భగీరథ పైపులైన్లు, చెరువుల్లో పూడిక తీత, మరమ్మతుల కోసం రూ. 14. 87 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. పెన్షన్లు, రైతు బంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్, కేసీఆర్ కిట్లు తదితర పథకాల ద్వారా వందలాది మంది లబ్ధి పొందినట్లు ఎమ్మెల్యే వివరించారు. సొంత జాగా ఉంటే ఇంటి నిర్మాణానికి 3 లక్షలు ప్రభుత్వం కేటాయించనున్నట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి గ్రామం అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు ఎంకేఆర్ ఫౌండేషన్ ద్వారా యువతకు శిక్షణ ఇప్పించి సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో వారి సమస్యలు తెలుసుకునేందుకు ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కృపేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, సర్పంచులు బల్వంత్‌రెడ్డి, శివరాల జ్యోతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బుగ్గరాములు, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బుధవారం ముకునూర్ గ్రామంలో మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి పాదయాత్ర కొనసాగింది. వృద్ధులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు స్వాగతం పలికారు.

ప్రశ్నించే గొంతుకను మండలికి పంపుదాం



నేదునూరు మోడల్ స్కూల్‌లో ప్రచారం చేస్తున్న ప్రవీణ్‌కుమార్ తదితరులు

కందుకూరు: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, సమస్యలపై ప్రశ్నించే గొంతుకను శాసన మండలికి పంపుదామని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కందుకూరు, నేదునూరు, ముచ్చర్ల, పులిమామిడి, రాచులూరు, లేమూరు పాఠశాలల్లో ఎస్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి భుజంగరావు తరపున ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 సంవత్సరాలుగా ఉపాధ్యాయ ఉద్యమాలలో నిరంతరం పోరాటాలు చేస్తున్న ఎస్టీయూ అధికారిక అభ్యర్థి భుజంగరావుకే మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయుల ఓట్లతో గెలిచి వారి సమస్యలను గాలికొదిలేసిన ఎమ్మెల్సీలకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైయిందని అన్నారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా డబ్బులు ఎర చూపి ఓట్లు వేయించుకోవడం అప్రజాస్వామ్యమన్నారు. పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, బదిలీలు, పదోన్నతులు చిత్తశుద్ధితో చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఏవీ సుధాకర్, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటేశం, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సభ్యులు పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సంజీవన్‌కుమార్



మొయినాబాద్: ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అమ్డాపూర్ పాఠశాల ఉపాధ్యాయుడు బొట్లపల్లి సంజీవన్‌కుమార్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కొత్తగట్టు శ్రీనివాస్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ నియామకపత్రాన్ని అందజేశారు. పరిగి మండలం రావులపల్లికి చెందిన సంజీవన్‌కుమార్ ముదిరాజ్ మొయినాబాద్ మండలంలోని అమ్డాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్ జాతి అభ్యున్నతికి, విద్యార్థుల ఉన్నతికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మెపాను విస్తరించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

ప్రమాదకర పరిశ్రమను మూసివేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ



కొత్తపల్లిలోని పరిశ్రమను పరిశీలిస్తున్న సీపీఎం బృందం

యాచారం: ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన కొత్తపల్లిలోని ఆగ్రో ఫీడ్ కంపెనీని మూసివేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఆగ్రో ఫీడ్ కంపెనీ పేరుతో పశువుల కళేబరాలు, మాంసం ముద్దలు తెచ్చి నూనె తయారు చేస్తున్న పరిశ్రమపై సర్కార్‌కు ఎందుకంత ప్రేమ అని ఆయన ప్రశ్నించారు. సీపీఎం బృందం బుధవారం కొత్తపల్లిలోని పరిశ్రమను పరిశీలించి గ్రామస్తులు చేస్తున్న నిరాహార దీక్షకు మద్దతు పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలకు ముప్పుగా ఉన్న కంపెనీని మూసేయాలని ప్రజలు 14 రోజులుగా ఆందోళన, ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. ప్రజల ప్రాణాల కంటే కేసీఆర్ సర్కార్‌కు కంపెనీ ప్రయోజనాలే ముఖ్యమా అని ప్రశ్నించారు. కంపెనీ నుంచి వచ్చే దుర్వాసన వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం ప్రమాదకర పరిశ్రమను మూసివేయాలని, లేకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు బీ మధుసూదన్‌రెడ్డి, జగదీష్, జిల్లా కమిటీ సభ్యులు కిషన్, కుమార్, సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, కొత్తపల్లి గ్రామ ఉప సర్పంచ్ కావలి జగన్, నాయకులు విప్లవ్‌కుమార్, పరమేష్ కుమార్, బుగ్గరాములు, కుమార్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో సంపూర్ణ ఆరోగ్యం




సైక్లింగ్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్: నిత్యం సైక్లింగ్ చేయడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. బుధవారం పట్టణంలోని మినీ స్టేడియంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సైక్లింగ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. ప్రతి రోజూ వ్యాయామం చేస్తే మనిషి ఆరోగ్యంగా ఉంటారన్నారు. అరగంట పాటు సైకిల్ తొక్కడం వల్ల కొవ్వు వేగంగా కరుగుతుందన్నారు. అదేవిధంగా శరీర బరువుతో ఇబ్బంది పడేవారికి సైక్లింగ్ ఎంతో ఉపయోగంగా ఉంటుందని అన్నారు. మనిషికి గుండె జబ్బులు వచ్చే అవకాశం యాభైశాతం తగ్గుతుందన్నారు. సైక్లింగ్ శరీరం కోసమే కాకుండా మనస్సుకు మంచి ఉల్లాసాన్ని ఇస్తుందని, ఒత్తిడిని జయించవచ్చని అన్నారు. అంతే కాకుండా ఏకాగ్రత కూడా పెరుగుతుందన్నారు. పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో విధిగా వ్యాయామం, సైక్లింగ్ చేయడంతో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు ఎదురైతే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రవంతి, ఆనంద్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ల్యాబ్ టెక్నీషియన్, సిబ్బంది రాజు, చెన్నయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

పేదల ఇళ్ల స్థలాలను సర్వే చేయాల్సిందే

- లేకుంటే తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య



పేదలు తాత్కాలికంగా వేసుకున్న గుడిసెలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

కొందుర్గు: పట్టణ శివారులో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలకు సంబంధించిన భూమిని సర్వే చేయాలని లేకుంటే తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య హెచ్చరించారు. కొందుర్గులోని ఏనెగడ్డలో గతంలో వేసుకున్న తాత్కాలిక గుడిసెలను సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఇళ్ల స్థలాలు చూపించాలని గతంలో పలుమార్లు సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేసినా అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. పేదలు ఆ స్థలంలో గుడిసెలు వేసుకొని 100 రోజులు దాటినా అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సర్వేచేయించాలని కోరితే వివిధ సాకులు చూపుతూ అధికారులు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని పేదలకు న్యాయం చేయాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, సందమ్మ, బాలమణి, చిలుకమ్మ, బుచ్చమ్మ పాల్గొన్నారు.

బీజేపీ జీహెచ్ఎంసీ అధికార ప్రతినిధిగా శ్రీవాణి



శ్రీవాణికి స్వీట్ తినిపిస్తున్న కార్యకర్తలు

హుడాకాంప్లెక్స్: బీజేపీ జీహెచ్ఎంసీ అధికార ప్రతినిధిగా సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి నియమితులయ్యారు. బుధవారం పార్టీ అధిష్టానం ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది. ఈ సందర్భంగా ఆకుల శ్రీవాణి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, పార్టీ సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానన్నారు. బూత్ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ

దంపతులకు గాయాలు



కేశంపేట: ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ కొనడంతో బైక్‌పై ప్రయాణం చేస్తున్న దంపతులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ఇప్పలపల్లి శివారులో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధితుల కథనం మేరకు.. ఫరూఖ్‌నగర్ మండలం పెద్ద చిల్కమర్రి గ్రామానికి చెందిన కంటె ఆంజనేయులు అతడి భార్య లక్ష్మీ బైక్‌పై కడ్తాల్‌కు వెళ్తుండగా మండలంలోని ఇప్పలపల్లి శివారులో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులుకు కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. వెనుక కూర్చున్న అతని భార్యకు గాయాలయ్యాయి. ఇరువురిని శంషాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బస్సును అజాగ్రత్తగా నడిపిన డ్రైవర్ రాములుపై చర్యలు తీసుకోవాలని బాధితుడి కుమారుడు మనీష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం



పక్కీరమ్మ(ఫైల్)

చేవెళ్ల: రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి కనిపించకుండా పోయింది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ హయూమ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చేవెళ్లకు చెందిన తూర్పు వెంకటప్పా చిన్న కూతురు పక్కీరమ్మ ఈ నెల 13న ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో పలుచోట్ల వెతికారు. ఫలితం లేకపోవడంతో బుధవారం చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

శంకర్‌పల్లి: పేకాట ఆడుతున్న వ్యక్తులను బుధవారం శంకర్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. శంకర్‌పల్లిలోని ఓ పాఠశాలకు చెందిన బస్సు డ్రైవర్లు అదే పాఠశాల బస్సులో పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు 9మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 8వేల నగదు, 8 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

బాలిక అదృశ్యం



ఫాజియా బేగం(ఫైల్)

పహాడీషరీఫ్: బాలిక అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన మహ్మద్ హుస్సేన్ కుమార్తె ఫాజియా బేగం(17) ఇంటి వద్దే ఉంటుంది. ఈ నెల 13వ తేదీ రాత్రి 9 గంటల ప్రాంతంలో ఇంటి వెనుక కూర్చొంటానని చెప్పి వెళ్లింది. తిరిగి రాలేదు. దీంతో పలు చోట్ల వెతికినా ప్రయోజనం లేకపోయింది. ఆమె సోదరుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్, లేదా సెల్ నంబర్ 94906 17241లో తెలియజేయాలని పోలీసులు కోరారు.

21 నుంచి సిటీలో దస్తకారీ హాత్ క్రాఫ్టస్ బజార్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (ఎన్ఐటీహెచ్ఎం-గచ్చిబౌలి) వేదికగా దేశంలోనే ప్రసిద్ధిగాంచిన దస్తకారీ హాత్ క్రాఫ్ట్స్ బజార్‌ను ఏర్పాటు చేయనున్నామని దస్తకరీ హాత్ సమితి వ్యవస్థాపకురాలు జయా జైట్లీ ఒక ప్రకటనలో తెలిపారు. సిటీలో మొదటిసారిగా నిర్వహిస్తున్న ఈ కళా ప్రదర్శనలో 18 రాష్ట్రాల నుంచి వంద మందికి పైగా సంప్రదాయ భారతీయ హస్తకళాకారులు పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు. హస్తకళల సంరక్షణ, చేతివృత్తులవారి ప్రతిష్టను పెంపొందించడానికి జయ జైట్లీ 40 సంవత్సరాల నుంచి కృషి చేస్తున్నారు. నగరం వేదికగా తొలిసారి దస్తకారీ హాత్ క్రాఫ్ట్స్ బజార్‌ను నిర్వహిస్తున్న సందర్భంగా జయా జైట్లీ మాట్లాడుతూ తెలంగాణలో అద్భుతమైన హస్తకళాకారులు ఉన్నారని, వారిని కలవడానికి ఆతృతగా ఉన్నామని తెలిపారు.